పట్నం మోజులో
పల్లెను
మరచిన
అతనికి కనువిప్పు?

**బి.వేణుగోపాల్**

**కథ**


# అమ్మా! నే పల్లెకొచ్చేస్తా!

"జాగర్త నాయనా! బాగా సదూకో! బయట ఎక్కువగా తిరగమాకు. వారానికొక ఉత్తరం రాస్తూ ఉండు" కొడుకు రాజును బస్సెక్కించి జాగ్రత్తలు చెపుతోంది వీరమ్మ.

రాజు తలాడించాడు. పదవతరగతి పాసై పట్నంలో ఇంటర్మీడియెట్‌లో చేరిన ఆనందం అతని ముఖంలో తాండవిస్తోంది. బస్సు కదిలింది. వీరమ్మ దిగులుగా చూస్తోంది. రాజు వెళ్ళొస్తానని కూడా తల్లికి చెప్పలేదు. అతని మనస్సు అప్పుడే పట్టణంలో విహరిస్తోంది.

రాజు పట్నంలో అద్దెకు రూము తీసుకున్నాడు. రోజూ కాలేజీకి వెళ్ళి రావడం, తినడం, సాయంత్రం పూట అలా తిరగడం, సినిమాలకు వెళ్ళడం— ఇదీ అతని దినచర్య.

నూనూగు మీసాల యవ్వనం, ఊహల్లోంచి వాస్తవంలోకి వచ్చిన వాతావరణం రాజుని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. లేలేత అమ్మాయిల వాలుచూపులు, కొంటె చూపులు అతని మనస్సులో గిలిగింతలు పుట్టించసాగాయి. అమ్మాయిలు సైకిళ్ళపై, స్కూటర్లపై రావడం ఒకవింత. మిడ్డీలు, ఫ్రాకులు అంటూ మోకాలు కిందనుండి ఆచ్ఛాదన లేకుండా తిరగడం కవ్వింత. పంజాబీ డ్రస్సులు, స్లీవ్‌లెస్ జాకెట్లు. రకరకాల మోడరన్ డ్రస్సులు. రాజుకి మరో లోకంలో అడుగుపెట్టినట్టుగా ఉంది. అబ్బాయిలను చూసి పల్లెటూరిలోలాగా సిగ్గుపడుతూ తప్పించుకుని తిరిగే అమ్మాయిలెవరూ అతనికి కనిపించలేదు. అబ్బాయిలే పక్కకు



తప్పుకొని వెళుతుంటారు.

ఒక ఆదివారం రోజు ఫ్రెండ్సందరితో కలసి ఒక ఇంగ్లీషు సినిమాకెళ్ళాడు. అందులోని సెక్స్ సన్నివేశాలకు రాజు మనస్సు దాసోహం అయి[illegible]

తెలుగు సినిమాలంటే బోరు. ఇంగ్లీషు సినిమాలకు, అందులోను శృంగార సన్నివేశాలున్న సినిమాలకు మాత్రమే వెళతాడు.

పుస్తకం పట్టుకుంటే బొడ్డుకిందకి చీర కట్టుకొని తిరిగే నారీమణులు, లోపల ఏ రంగు బ్రా వేసుకున్నదీ స్పష్టంగా తెలియజె ప్పే పల్చటి జాకెట్లతో తిరిగే సుందరీమణు లు అతని కళ్ళముందు నిలిచేవారు. అతని చేతిలోని పుస్తకం వెంటనే మూతపడేది. అప్పుడప్పుడు మాత్రం "బాగా సదూకో వాయనా!" అన్న తల్లిమాటలు గుర్తుకొచ్చి ఎవరో చెంపవ ఛెళ్లున చరచినట్లయి వాస్తవం లోకి వచ్చేవాడు.

ఒక రోజు రాజు క్లాసులో కూర్చొని లెక్చరర్ చెప్తున్న పాఠాన్ని వింటున్నాడు. ఇంతలో బయట పెద్ద కలకలం. గుంపుగా కొంతమంది విద్యార్థులు వచ్చి వాళ్ళ రూము ముందు నిలబడ్డారు. వాళ్ళలోనుండి ఒకత ను లోపలికి దూసుకువచ్చాడు. లోపులున్న లెక్చరర్ పాఠాన్ని ఆపి పుస్తకాన్ని మడిచి చంకలో పెట్టుకొని బయటకి వెళ్ళిపోయా డు.

ఆ వచ్చినతను ఆ కాలేజి ప్రెసిడెంట్. అతను స్టూడెంట్స్‌నందరినీ ఒకసారి కలియ జూసి మాట్లాడ్డం మొదలుపెట్టాడు.

"డియర్ స్టూడెంట్స్! మన కాలేజీలు తెరిచి ఇన్ని రోజులైనా పాఠ్యపుస్తకాలు ఇంతవరకు రాలేదు. స్కాలర్‌షిప్‌లు పెంచా లని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకో వడంలేదు. నోట్ బుక్స్ ధరలు విపరీతంగా పెరిగాయి. కాబట్టి ఈ సమస్యలన్నిటికి నిరసనగా మనం ఈ రోజు స్ట్రయిక్ చేస్తున్నాం. విద్యార్థులందరూ తరగతులను బహిష్కరించి సమ్మెలో పాల్గొనవలసిందిగా కోరుచున్నాము".

అతని స్పీచ్ పూర్తవగానే ఇంకొకతను లోపలికొచ్చాడు. అతను కాలేజి ప్రెసిడెంట్‌గా పోటీచేసి ఓడిపోయిన వ్యక్తి. అతని చుట్టూ కొంతమంది స్టూడెంట్స్ ఉన్నారు

ఆ వచ్చినతను మాట్లాడడం మొదలెట్టా డు.

"సోదరులారా! మనకు కాలేజీ జరిగే రోజులు తక్కువ. పండగలనీ, వర్షాలనీ, వరదలనీ ఎన్నో రోజులు సెలవులుగా గడిపేస్తున్నాము. ఇప్పుడు మళ్ళీ స్ట్రయక్‌లనీ అవనీ, ఇవనీ విలువైన మన కాలాన్ని వృధా చేసుకుంటే భవిష్యత్తులో మనమే బాధపడా ల్సి వస్తుంది. కొందరు పనీపాటాలేని వ్యక్తులు స్ట్రయిక్‌లనీ లేనిపోని గొడవలు చేస్తుంటారు. దాన్ని మీరు పట్టించుకోవద్దు. ఈ రోజు క్లాసులు జరుగుతాయి. కూర్చోం డి."

అవతల ప్రెసిడెంట్ అతని మాటలకు ఉగ్రుడైపోయాడు.

"ఈరోజు క్లాసులు జరగవు. స్ట్రయిక్ జరుగుతుంది"

"స్ట్రయిక్ జరగదు. క్లాసులు జరిపిస్తాం."

మొదట మాటలు, తరువాత చేతులు కలిశాయి. అవతలి పార్టీ స్టూడెంట్స్, ఇవతలి పార్టీ స్టూడెంట్స్ రంగంలోకి దిగారు. పిచ్చిపట్టినట్టుగా కేకలేసుకుంటూ కొట్టుకో సాగారు. ప్రిన్సిపాల్ ఫోనందుకున్నాక పోలీసు లు కాలేజిలోకి ప్రవేశించి దొరికినవాడ్ని దొరికినట్టుగా చితకబాదసాగారు.

"లీవ్ ద కాలేజ్! లీవ్ ద కాలేజ్!" అంటూ ఎస్సై స్టూడెంట్స్‌నందరినీ తరిమి

తరిమి కొట్టసాగాడు. అందరూ తలా ఒక దిక్కుకి పరిగెత్తడం మొదలు పెట్టారు. రాజుకూడా పరిగెత్తాడు. అతని కాళ్ళల్లో బయలుదేరిన వణుకు ఒళ్ళంతా పాకింది. కాలేజీలలో కొట్టుకుంటారని వినడమేగాని ప్రత్యక్షంగా చూడడం ఇదే మొదటిసారి. రాజు ఆ దృశ్యం చూసిన తర్వాత జ్వరంతో మంచానపడ్డాడు. అప్పుడు అతనికి మనస్ఫూర్తిగా తల్లి గుర్తుకొచ్చింది. అదే తను ఇంట్లో ఉంటే ఈ స్థితిలో తనను అమ్మ కంటికి రెప్పలా కాపాడుకునేది. కానీ ఇక్కడెవరు చూస్తారు? రాజు కళ్ళు నీటితో నిండాయి.

లేని సత్తువను కూడతీసుకొని హాస్పిటల్‌కు వెళ్ళాడు. ఆ డాక్టరు ఇంజక్షనుచేసి ఇరవై రూపాయలు తీసుకున్నాడు. రాజు ఆశ్చర్యపోయాడు. అదే తమ ఊర్లో డాక్టరు మూడు రూపాయలుతీసుకునేవాడు. కానీ ఇక్కడ ఇరవై రూపాయలు. అదే జబ్బు, అదే మందు. కానీ అక్కడికీ ఇక్కడికీ ఎంత తేడా?

మూడు రోజులు కాలేజి మూసేసి మళ్ళీ తెరిచారు. రాజు కాలేజికి వెళ్ళి వస్తున్నాడు. కానీ మునుపటి ఆనందం, ఉత్సాహం అతనిలో లేవు. నెమ్మది నెమ్మదిగా పట్నవాసపు కృత్రిమ తెరలు తొలగిపోతున్నాయి.

క్లాసుకి అందరూ హాజరుకారు. వచ్చిన వాళ్ళు కాలక్షేపానికి వస్తారేకాని చదవడానికి రారు. కాలేజీలోని లెక్చరర్లే చదువు చెప్పడానికి నిరాసక్తత వ్యక్తం చేస్తారు. స్టూడెంట్సందరూ బయట ట్యూషన్స్‌లోచేరి చదువుతారు. బయట ట్యూషన్స్ చెప్పేవాళ్ళు ఎవరోకాదు. కాలేజీలో చెప్పే లెక్చరర్లే. అయితే స్టూడెంట్స్‌కు అవసరమైన నోట్సు ట్యూషన్స్‌లో మాత్రమే చెప్తారు, క్లాసులో చెప్పరు. ట్యూషన్స్ కెళ్ళాలంటే సబ్జెక్టుకు సంవత్సరానికి కనీసం నాలుగు వందలు వసూలు చేస్తారు. రాజుకి ఏం చేయాలో అర్థం కాలేదు. చదువుమీద శ్రద్ధఉంది. కానీ చదివేదారి లేదు. ట్యూషన్స్ చెప్పించుకునే



స్తోమత లేదు. తన తల్లి సంపాదన అంతంత మాత్రమని అతనికి తెలుసు. కానీ తనేం చేయగలడు.

పట్నంలో చదవాలన్నా, బతకాలన్నా మొదటి అర్హత, డబ్బు అనేది అతనికి స్పష్టంగా అర్థమైపోయింది. వారం రోజుల తర్వాత వీరమ్మ కొడుకును చూడడానికి వచ్చింది. తల్లిని చూడగానే రాజు మనస్సు ఆనందంతో గంతులేసింది. కొడుకుని ఆప్యాయంగా దగ్గరికి తీసుకుంది వీరమ్మ.

"అమ్మా! నేను ఇక్కడ ఉండను. నే పల్లెకొచ్చేస్తా" అన్నాడు రాజు. ఉలిక్కిపడింది వీరమ్మ.

'ఏమైంది నాయనా?" ఆదుర్దాగా అడిగింది వీరమ్మ.

ఏం చెప్పాలో అర్థం కాలేదు రాజుకి. మౌనంగా రోదించసాగాడు. తను పట్నంలో అడుగుపెట్టినప్పటినుండి జరిగిన అనుభవాలు మెదడు పొరల్లో కదలాడసాగాయి. తల్లక్రిందులైన ఊహలు వెక్కిరించసాగాయి.

"ఏమని చెప్పను అమ్మా! మగాళ్ళను రెచ్చగొట్టేవిధంగా చీర కట్టుకువెళ్ళే ఆడవాళ్ళ గురించి చెప్పనా! రోడ్డుమీద వెళుతుంటే గోడమీద బొమ్మలు కవ్విస్తున్నాయని చెప్పనా! పుస్తకం పట్టుకుంటే నా మనస్సు అధీనం తప్పుతుందని చెప్పనా! కాలేజీల్లో విచక్షణా రహితంగా కొట్టుకుంటారని చెప్పనా! లెక్చరర్లు పాఠాలు చెప్పరనీ, ట్యూషన్లు చదివితే తప్ప పాస్ కాననీ చెప్పనా! చదువు'కునే' రోజులుపోయి చదువు'కొనే' రోజులు వచ్చాయని చెప్పనా! ఏమని చెప్పమంటావమ్మా!'


ఉలుకూ పలుకూ లేకుండా కన్నీళ్ళు కారుస్తున్న కొడుకుని చూసి వీరమ్మ గాభరా పడింది.

కొడుకు చేతులు పట్టుకొని "ఎందుకేడుస్తున్నావ్ నాయనా! ఏం కష్టంమొచ్చింది!" ఆమె కంఠం ప్రేమతో వణికింది.

రాజు వాస్తవంలోకి వచ్చాడు.

'అమ్మా! నే పల్లెకొచ్చేస్తా!'

✱



డిజైన్: కె.మునిరెడ్డి (గ్రీవ్స్‌పేట)